

కానుకలు వద్దు.. నగదే ఇద్దాం!
ఆదివాసీ మహిళలు వినూత్న ఆలోచన గూడేల్లో మార్పు తెచ్చింది. ఆడపిల్లల వివాహానికి కానుకలు కాకుండా నగదు రూపంలో సాయం చేస్తున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:24	గురు : 4:58

గరిష్టం/కనిష్టం 38.4 /23.6

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అభ్యసన సామర్థ్యాలకు కృత్రిమ మేధ



శిక్షణలో మాట్లాడుతున్న చౌదరి

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల సాధనకు కృత్రిమ మేధ(ఏఐ)దోహదపడుతుందని సమగ్రశిక్ష ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ చౌదరి అన్నారు. మంచిర్యాల సైన్స్ కేంద్రంలో గురువారం నుంచి కృతిమ మేధ పాఠాలు ప్రారంభించే 16 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవా రం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనకబడిన పిల్లలకు కంప్యూటర్ ద్వారా కృత్రిమ మేధ సహాయంతో విద్య నందించటం ఎంతో గొప్ప విషయమన్నారు. విద్యార్థులకు స్వీయ ప్రేరణ, స్వీయభ్యసన అనుభవం చక్కగా కలుగుతుందని తద్వారా విద్యపై మక్కువ ఏర్పడి పాఠశాలకు వచ్చేలా చేయచ్చన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, మస్టార్ ట్రైనర్లు శ్రీధర్, రాజగోపాల్, రజిత, 16 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్యం చేరిన కేకే–5

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ మందమర్రి ఏరియాలోని కేకే–5 గని వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని పది రోజుల ముందే చేరుకుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను గని ఉత్పత్తి లక్ష్యం 2 లక్షల టన్నులు. ఈ లక్ష్యాన్ని ఆర్థిక సంవత్సరం ముగింపునకు పది రోజుల ముందే చేరుకుంది. ఈ నెలాఖరు వరకు మరో 5 వేల టన్నులు అదనంగా ఉత్పత్తి చేస్తామని కార్మికులు తెలిపారు. కార్మికులు ఇదే ఉత్సాహంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ పని చేయాలని జీఎం సూచించారు. కార్మికులను అభినందించారు.

పాలన సౌలభ్యం కోసం ఒకే ఎన్నిక


బీజేపీలోకి ఆహ్వానిస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్


వేమనపల్లి: పాలన సౌలభ్యం కోసమే వన్ నేషన్, వన్ ఎలక్షన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక అనే భావన రాజకీయ, ఆర్థిక పరిపాలన సామర్థ్యాన్ని పెంపొదిస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికలు నిర్వహించడం ద్వారా సమర్థవంతమైన పాలనను అందించవచ్చని తెలిపారు. అధికార యంత్రాంగానికి కూడా సమర్థవంతంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఒకే సారి ఎన్నికలు నిర్వహిస్తే సమయం ఆదాతో పాటు పరిపాలనపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. పోలింగ్ శాతం కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ముల్కలపేట, నాగారాం, వేమనపల్లికి చెందిన పలువురు బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో వెంకటేశ్, అజయ్‌కుమార్, శ్రీకాంత్, మొహిద్‌ఖాన్, మధునయ్య, చరణ్‌రాజ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో హైదరాబాద్ కేర్ ఆస్పత్రి సహకారంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కమాండెంట్ పి.వెంకటరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బెటాలియన్ అధికారులకు, సిబ్బందికి, కుటుంబ సభ్యులకు సాధారణ వైద్య పరీక్షలతోపాటు ఎముకలు, కీళ్లు, జీర్ణాశయ, మూత్రపిండాలు తదితన ప్రత్యేక వైద్య చికిత్సలను కేర్ ఆస్పత్రి వైద్యులు ప్రభాకర్, ఆదిత్య, రమీజ్‌పంజ్వాని పరీక్షలు చేశారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌లు ఆర్.నాగేశ్వర్‌రావు, కాశిదాసు, యూనిట్ మెడికల్ అధికారి డాక్టర్ సంతోష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తలాపునే గోదావరి.. తడారుతున్న మడి


గోదావరిలో ఏర్పాటు చేసి ఫిల్టర్ బోర్లు


బీటలువారుతున్న వరి పంట

తలాపునే గోదావరి ఉన్నా.. జైపూర్, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో వరి పొలాలు తడారుతున్నాయి. ఈ మూడు మండలాల్లో గోదావరి, ప్రాణహిత నది తీర ప్రాంతాల్లో రైతులు ఏటా పంటలు సాగుచేస్తారు. నదిలో ఫిల్టర్ బోర్లు వేసి పంటలు పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది రైతన్నలకు భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఏటా ఎల్లంపల్లి నుంచి దిగువకు నీటిని వదిలేవారు. కానీ, ఈసారి నీరు వదలలేదు. గోదావరి ఎడారిని తలపిస్తోంది. బోర్లు వట్టిపోతున్నాయి. దీంతో కళ్ల ముందే ఎండుతున్న పంటలను చూసి రైతులు దిగాలు చెందుతున్నారు. నది గర్భంలో నీటి లభ్యత తక్కువగా ఉండడంతో బోర్ల నుంచి నీరు రాక పొలాలు ఎండుతున్నాయని పేర్కొంటున్నారు. జైపూర్, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో గోదావరి తీరం వెంట సుమారు 4 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పంటలు చివరి దశలో ఉన్నందున ఎల్లంపల్లి నుంచి నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. - (జైపూర్)

మిగిలింది 5 రోజులే..!

- ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపు అంతంతే..
- మున్సిపాలిటీల్లో కాల్ సెంటర్, హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు
- అవగాహన కల్పిస్తున్నా ముందుకురాని లబ్ధిదారులు


మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో అనధికారిక లేఅవుట్లు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్‌ఎస్ తీసుకువచ్చింది. ఇందులో భాగంగా అర్హులు చెల్లించే ఫీజులో ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇచ్చింది. 2020 ఆగస్టు 26కు ముందు అనధికార భూములు ఉన్న వారు ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. కొన్ని కారణాలతో వాటిని క్రమబద్ధీకరించలేదు. గతేడాది నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్రమబద్ధీకరిస్తున్నా, ప్రజల నుంచి అంతగా స్పందన రాలేదు. దీంతో గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ.1000 కట్టి దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, దరఖాస్తు చేయని వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించి. ఈ నెల 31వ తేదీ వరకు గడువు విధించింది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రూ.1000 చెల్లించకుండా, దరఖాస్తు కూడా చేసుకోని వారికి మాత్రం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి అక్కడే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించుకునేందుకు అవకాశం కల్పించారు. 25 శాతం రాయితీని కల్పించడం వల్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని ప్రభుత్వం భావించినా, సమయం తక్కువగా ఉండడం, ఒకేసారి వేలాది రూపాయల ఫీజు చెల్లించలేని వారు ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఆసక్తి చూపించడం లేదు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనూ అమ్మకాలు, కొనుగోళ్లు జరిపే వారు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నా అంతంతే

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో 55,380 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. వాటిలో పేమెంట్‌కు అప్రూవ్ అయినవి 25,554 కాగా, అందులోనూ 25 శాతం రాయితీతో ఫీజు చెల్లించినవి కేవలం 1,944 మాత్రమే. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోనివారికి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించేందుకు అవకాశం కల్పించారు. ఈనెల 25వ తేదీ వరకు మంచిర్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 99 వరకు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల చెల్లింపు జరిగింది. 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు మంచిర్యాల కార్పొరేషన్ అధికారులు, ఇతర మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లతో ఒక కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నేరుగా కాల్ సెంటర్ నుంచి ఫోన్ చేసి, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలని కోరుతున్నారు. దీంతోపాటు, కార్పొరేషన్ కార్యాలయం ముందు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసి, అందులో కార్యాలయ సిబ్బందిని ఉంచారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై అనుమానాలు ఉన్నా, ఎంత మేర ఫీజు చెల్లించాలనే వివరాలను నేరుగా హెల్ప్‌డెస్క్‌కు వెళ్లి తెలుసుకుంటున్నారు. ఫీజు చెల్లింపుల్లోనూ ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పట్టణ ప్రణాళిక విభాగం కార్యాలయం ముందు యూపీఐ స్కానర్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలకు అవగాహన పెంచుతున్నా, తక్కువ సమయం ఇవ్వడం, మార్చి నెలలో ఐటీ చెల్లింపులు, ఇతరత్రా చెల్లింపులతో ఆర్థికంగా ఇబ్బంది పడుతుండంతో, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులకు అంతగా ఆసక్తి చూపించడం లేదు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ భూముల క్రయ విక్రయాలకు సంబంధించిన వాటివి మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారు. దస్తావేజు లేఖరులు, రియల్ వ్యాపారులు, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులతో సమావేశాలను ఏర్పాటు చేసి, అవగాహన కల్పించినా అంతంత మాత్రంగానే ఫీజు చెల్లిస్తున్నారు. గడువులోపు వంద శాతం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులు వచ్చే అవకాశం లేకపోవడంతో, దరఖాస్తుదారులకు ఫీజు ఎంత మేర చెల్లించాల్సి వస్తుందో తెలియజేసి, గడువు కొంత పెంచితే ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటుంది. ఎల్‌ఆర్‌ఎస్ 25 శాతం రాయితీ గడువును పెంచేది లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం స్పష్టం చేయడం, గడువు మరో ఐదు రోజులే మిగిలి ఉండడంతో, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులను దరఖాస్తుదారులు చేయడం కష్టమే.

అవగాహన కల్పిస్తున్నా



మంచిర్యాల ప్రాంత ప్రజలు గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఫీజు చెల్లించని వారికి నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 25 శాతం రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్ కట్టుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనిపై డాక్యుమెంట్ రైటర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతోపాటు, కార్యాలయానికి వచ్చే వారికి అవగాహన కల్పిస్తున్నాం. మొదట్లో సాఫ్ట్‌వేర్ సమస్యతో కొంత ఇబ్బందిగా ఉన్నా, ఇప్పుడు ప్రజల్లో అవగాహన పెరిగి, ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. 31వ తేదీలోపు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించి 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి.

ప్రియాంక, మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్

మండలాల వారీగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, పేమెంట్‌కు అప్రూవ్ అయినవి, ఫీజు చెల్లించినవారి వివరాలు..

మండలం/ మున్సిపాలిటీ	ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు	అప్రూవ్ పేమెంట్	ఫీ పెయిడ్
బెల్లంపల్లి	638	499	52
భీమారం	316	228	19
భీమిని	17	14	0
చెన్నూరు	1,118	770	87
దండేపల్లి	495	370	23
హాజీపూర్	878	670	53
జైపూర్	3,009	2,109	188
జన్నారం	1,992	1,342	30
కన్నెపల్లి	2	2	0
కాసిపేట	388	187	9
కోటపల్లి	5	2	0
లక్సెట్టిపేట్	334	145	13
మందమర్రి	1,104	796	65
నెన్నెల	13	2	0
తాండూరు	331	225	19
వేమనపల్లి	3	3	1
మొత్తం	10,643	7,364	559
మున్సిపాలిటీల్లో..			
మంచిర్యాల కార్పొరేషన్	33,371	12,943	1,073
బెల్లంపల్లి	491	359	6
చెన్నూరు	1,330	741	59
క్యాతన్‌పల్లి	7,348	3,259	202
లక్సెట్టిపేట్	2,175	880	44
మందమర్రి	22	8	1
మొత్తం	44,737	18,190	1,385

సర్కార్ బడిలో సాంకేతిక పాఠాలు

- 50 మంది విద్యార్థులుదాటిన స్కూళ్లకు 5 కంప్యూటర్లు
- జూన్ 1 నాటికి 69 ప్రాథమిక పాఠశాలలకు సరఫరా


కంప్యూటర్‌పై పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: ప్రాథమిక పాఠశాలల్లో ఆధునిక సాంకేతిక విప్లవం కృతిమ మేధ(ఆర్టిఫిషీయల్ ఇంటిలీజెన్స్ –ఏఐ) పాఠాలు వేగవంతం చేశారు. కార్పొరేట్‌విద్యా సంస్థలకు దీటుగా గ్రామీణప్రాంత విద్యార్థులను సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఏడు పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ(ఏఐ)జరుగుతోంది. ఇంకోవైపు ప్రభుత్వం 50 మందికి పైగా విద్యార్థులున్న ప్రతీ ప్రాథమిక పాఠశాలలకు 5 కంప్యూటర్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 1నాటికి పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో 50 మంది దాటిన పాఠశాలలు 69 ఉండగా అవసరమైన కంప్యూటర్లు సరఫరా చేయనున్నారు.

ఏఐ పాఠాలతో..

ఏఐ వినియోగంతో ప్రాథమిక దశలోనే విద్యార్థులకు కంప్యూటర్లపై అవగాహన కలుగనుంది. కంప్యూటర్ విద్యపై భయం తొలగనుంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా చేపట్టిన సాంకేతికబోధనతో విద్యార్థులు చతుర్విద ప్రక్రియలు నేర్చుకుంటున్నారు. తొలి సారిగా ఏడు పాఠశాలల్లో కంప్యూటర్లతో పాఠాలు నేర్చుకునే అవకాశం దక్కింది. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు కంప్యూటర్‌లో పదాలు, వాక్యాలు, కూడికలు, తీసివేతల సామర్థ్యాలను అంచనావేసే కేటగిరీలుగా విభజించారు. ఒక్కో విద్యార్థికి రోజుకు 20 నిమిషాలు చొప్పున వారంలో నాలుగు రోజులు ఏఐ పాఠాలు నేర్చుకునే అవకాశమిస్తున్నారు. ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు.

రెండో దఫాలో..

మొదటి దఫాలో 7 సర్కారు పాఠశాలల్లో కంప్యూటర్లలో పాఠాలు కొనసాగుతుండగా రెండో దఫాలో 16 పాఠశాలలను ఎంపిక చేశారు. ఉన్నత పాఠశాలలు సమీపంలోని ఎంపీపీఎస్ పాఠశాలలను గుర్తించారు. ఆయా పాఠశాలల నుంచి కంప్యూటర్లు తెప్పించి ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ బోధన చేపట్టనున్నారు. భీమిని మండలం ఎంపీపీఎస్, ఎస్సీకాలనీ, దండేపల్లి మండలం ఎంపీయూపీఎస్–లింగపూర్, ఎంపీపీఎస్ మామిడిపల్లి, ఎంపీపీఎస్ కొర్మిచెర్ల, ఎంపీపీఎస్ వెల్లగనూర్, ఎంపీపీఎస్ గుడిరేవు, జన్నారం మండలంలో ఎంపీపీఎస్‌ఎస్ తపాలపూర్, ఎంపీపీఎస్ పోన్కల్, ఎంపీపీఎస్ కొత్తపల్లి, జైపూర్ మండలంలో ఎంపీపీఎస్ షెట్‌పల్లి, కన్నెపల్లి మండలంలో ఎంపీపీఎస్ జనకాపూర్, కోటపల్లి మండలంలో ఎంపీపీఎస్ సిర్సా, ఎంపీపీఎస్ పార్‌పల్లి, ఎంపీపీఎస్ అన్నారం, లక్సెట్టిపేట మండలంలో ఎంపీపీఎస్ లక్ష్మీపూర్, మంచిర్యాలలో జీపీఎస్ సినిమావాడ స్కూల్‌లో కంప్యూటర్ బోధనకు కసరత్తు పూర్తి చేశారు. గురువారం నుంచి కంప్యూటర్ (ఏఐ) పాఠాలు ప్రారంభించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన

మంచిర్యాలటౌన్: హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లోని ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాలకు సంబంధించిన మేజర్ డాటర్స్‌కు పరిహారం కోసం దరఖాస్తులను పరిశీలించనున్నట్లు ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. గుడిపేట్, నంనూర్, చందనాపూర్, రాపల్లి, కొండపల్లి, కర్ణమామిడి, పడ్తన్‌పల్లి, గుల్లకోట, సూరారం గ్రామాల నుంచి 1,351 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. బుధవారం నుంచి వీటిని పరిశీలిస్తామని వెల్లడించారు. మేజర్ డాటర్స్‌కు ఇదే చివరి అవకాశంగా భావించాలని, ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పట్టు వస్త్రాలపై దృష్టిసారించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్


చీర కొనుగోలు చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్: సెరీ కల్చర్ రైతులు దసలి పట్టు కాయలు పండించడంతోపాటు పట్టు వస్త్రాల ఉత్పత్తిపై దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. స్థానిక సెరికల్చర్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన దసలి పట్టు కృషి మేళాకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూ.40 లక్షలతో నిర్మించిన సెరికల్చర్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కృషి మేళాను ప్రారంభించారు. దసలి కాయలు పండించే రైతులు ధర కోసం బాధపడడం మానుకుని దారం తీసి బట్టలు తయా రు చేస్తే ఆదాయంతోపాటు, ఉపాధి పెరుగుతుందన్నారు. చెన్నూర్ సెరికల్చర్ పరధిలో రాష్ట్రంలోనే నాణ్యమైన దసలి కాయతోపాటు ఉత్పత్తి సైతం బాగుందన్నారు. అటవీ ప్రాంతంలో మద్ది చెట్ల పెంపకాన్ని చేపడితే రైతులకు మేలు జరుగుతుందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి మద్ది చెట్ల పెంపకంతోపాటు రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దారం తీసి వస్త్రాలు తయారు చేసేలా శిక్షణ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. ప్రతిపాదనలు పంపించాలని సమర్థ్ పథకం ద్వారా నిధులు మంజూరవుతాయన్నారు. అనంతరం డైరెక్టర్ సెంట్రల్ సిల్క్ బోర్డు రాంచికి చెందిన డాక్టర్ ఎన్.బాలజీచౌదరి మాట్లాడుతూ దసలి గుడ్లు పంపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కాయ దిగుబడి పెంచాలన్నారు. అనంతరం చెన్నూర్ సెరికల్చర్ పరిధిలోని ముల్కలపేట, ఎదుల్లబంధం గ్రామాలకు చెందిన నలుగురు రైతులకు ప్రశంసాపత్రాలు మెమొంటోలను అందజేశారు. మేళాలో ప్రదర్శించిన దసలి పట్టు చీరలు, శాలువాలు, బునియాది మిషన్, స్పాన్ సిల్క్ మిషన్ దకట్టుకున్నాయి. డాక్టర్ సెలక్వకుమార్, సెరికల్చర్ హైదరాబాద్ జేడీ లత, అసిస్టెంట్ సెక్రెటరీ డాక్టర్ మధుకుమార్, ఏడీ రాథోడ్ పార్వతి, డీహెచ్‌ఎస్‌వో కె.అనిత పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే క్రిమినల్ కేసులు

- పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించినా నేరమే
- కలెక్టర్ కుమార్ దీపక్


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: లింగ నిర్ధారణ నేరమని, పరీక్ష చేయడం, ప్రోత్సహించడం రెండూ నేరమే అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మారంరెడ్డి, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఎంహెచ్‌వో హరీష్ రాజ్‌తో కలిసి లింగనిర్ధారణపై మంగళవారం సమీక్ష చేశారు. జిల్లాలో 52 స్కానింగ్ సెంటర్లు పని చేస్తున్నాయని, ఇందులో 4 ప్రభుత్వ ఆసుపత్రులలో, 48 ప్రైవేట్ వైద్యుల ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుట్టబో యేది ఆడ లేక మగ అని తెలియజేయకూడదన్నారు. అలాంటివారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో తగ్గిన బాలికల నిష్పత్తిపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స చేయాలి..

జిల్లాలోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకు మించి వైద్యం చేసినట్లుగా నిర్ధారణ అయితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అనంతరం కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి ప్రసాద్, డాక్టర్ కృపబాయి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, ఎస్‌వో కాంతారావు, ఎన్‌జీవోలు డాక్టర్ రాధిక, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ, సీఐ ప్రమోద్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణలపై చర్యలు తీసుకోవాలి

అనుమతి లేని నిర్మాణలను పరిశీలించి చర్య తీసుకోవాలని, జిల్లాలో పురపాలక సంఘాల ఆదాయ వనరులను అభివృద్ధి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. పురపాలక సంఘాల కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం లోపించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చే యాలన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థల పన్నులతోపాటు ట్రేడ్ లైసెన్స్‌లు, ఆస్తి పన్నులను 100 శాతం వసూలు చేయాలని తెలిపారు. ఎల్‌ఆర్ ఎ స్ పథకంలో భాగంగా అర్హులైన అభ్యర్థుల నుంచి రుసుం వసూలు వేగవంతం చేయాలన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద(నిర్మల్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన గుడిమల్ల రాజు లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్‌లో విద్యుత్ శాఖలో జేఎల్‌ఎం గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం వద్యాల్‌లో సిబ్బందితో కలిసి విద్యుత్ బిల్లులు వసులు చేశారు. మధ్యాహ్నం బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కనకాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై ఖానాపూర్ వైపు నుండి వేగంగా వస్తున్న కారు రాజు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ముందుగా నిర్మల్ ఏరియా ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ప్రొబేషనరీ ఎస్సై జుబేర్, ఏఎస్సై నారాయణరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

టిప్పర్, బైక్ ఢీకొని ఇద్దరికి ...



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

దస్తురాబాద్: బుట్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నూర్ గ్రామ సమీపంలో మంగళవారం టిప్పర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై సీ.అశోక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని చెన్నూర్‌కు చెందిన శంకర్‌గౌడ్, కలమడుగుకు చెందిన రాకేశ్ ద్విచక్ర వాహనంపై కలమడుగు నుంచి చెన్నూర్‌కు వస్తుండగా పాండ్వాపూర్–కలమడుగు రహదారిపై టిప్పర్ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను జగిత్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శంకర్ గౌడ్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

సిరికొండ: ఎడ్లబండ్లపై అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు ఫారెస్టు డివిజన్ అధికారి రేవంత్‌చంద్ర తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి గోపాల్‌పూర్ గ్రామ శివారులో మారుతిగూడకు చెందిన వ్యక్తులు రెండు ఎడ్లబండ్లపై కలపను తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితులు పారిపోయారని, కలపను, ఎడ్లబండ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కలప విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడిలో సిరిచెల్మ ఎఫ్ఆర్వో నాగవత్ స్వామి, ఇంద్రవెల్లి ఎఫ్ఆర్వో సంతోష్, సిరికొండ డీఆర్వో నరేష్, తదితరులు ఉన్నారు.

కానుకలు వద్దు.. నగదే ఇద్దాం!

- మంగళ్‌మోట్ మహిళ వినూత్న ఆలోచన
- ఆడపిల్ల పెళ్లికి వస్తువులకు బదులు నగదే ఇవ్వాలని నిర్ణయం..
- ఆదివాసీ మహిళ ఐడియా.. జిల్లా అంతా ఆచరణ
- పెళ్లి కూతుళ్లకు నగదు ఇస్తూ అండగా నిలుస్తున్న గూడేలు



పెళ్లికూతురుకు నగదు అందజేస్తున్న మహిళలు (ఫైల్)



మెస్రం శ్రీదేవి

ఇచ్చోడ(బోథ్): ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం తర్నం(బి) పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామమైన మంగళ్‌మోట్ ఆదివాసీ మహిళలు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఆడపిల్లల వివాహం కుటుంబ పెద్దకు భారం కాకూడదని భావించి వివాహ సమయంలో కట్నకానుకల కింద ఇచ్చే ఇత్తడి, వెండి, స్టీల్ సామగ్రికి బదులు నగదు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించారు. ఆదివాసీ మహిళలు తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంప్రదాయబద్ధంగా మారింది. ఆదివాసీ గూడేల్లో ఎక్కడ పెళ్లి జరిగినా కట్నకానుకలు తీసుకోవడం లేదు. వాటికి బదులుగా తోచినంత నగదు అందించి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

వయసు చిన్నది..ఆలోచన పెద్దది

మంగళ్‌మోట్ గ్రామానికి చెందిన మెస్రం శ్రీదేవి ఐదోతరగతి నుంచి పదోతరగతి వరకు నేరడిగొండ మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలలో చదివి ఉత్తమ మార్కులు సాధించింది. ఐటీడీఏ తరఫున హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. జీఎన్‌ఎం ట్రైనింగ్ పూర్తి చేసి కొంతకాలం ప్రైవేట్ ఉద్యోగం చేసింది. 2018లో అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెళ్లిళ్లలో కట్నం కింద సామగ్రి ఇస్తుండడంతో డబ్బులు వృథా అవుతున్నాయని శ్రీదేవితో పాటు పలువురు మహిళలు గుర్తించారు. ఈ మేరకు కట్నకానుకలు నిషేధించి వాటికి బదులుగా నగదు ఇవ్వడంతో పెళ్లి కూతురు ఇంటి పెద్దకు కొంత ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు అవుతుందని భావించి గ్రామస్తులకు విషయాన్ని తెలియజేసింది. గ్రామపెద్దలు సైతం ఆమెతో ఏకీభవించారు. ఇక నుంచి కట్నం కింద వస్తువులు ఇవ్వడం నిషేధమని తీర్మానించి అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది మార్చి 3న మంగళ్‌మోట్‌లో జరిగిన వసంత వివాహానికి ఊరి ఆడపడుచులంతా కలిసి రూ.20 వేల నగదును అందజేశారు. మారుమూల గ్రామంలో తీసుకున్న ఈ నిర్ణయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గూడేల ప్రజలను ఆలోచింపజేసింది.

ఇటీవల పలుచోట్ల ఇలా..

- ఈనెల 14న సిరికొండ మండలంలోని కోసుపటేల్‌గూడకు చెందిన యువతి వివాహం జరిగింది. గ్రామస్తులంతా కలిసి రూ.20 వేల నగదు అందజేశారు.
- ఈ నెల 20న ఇంద్రవెల్లి మండలం సమాకలో తొడసం గౌరుబాయి వివాహం కొట్నక్ దేవ్‌రావుతో జరిగింది. గ్రామస్తులు ప్రతీ ఇంటి నుంచి రూ.200 జమచేసి రూ.24,900 నగదును కట్నకానుకలకు బదులుగా అందజేసినట్లు గ్రామ పటేల్ పెందూర్ భగవంత్‌రావు తెలిపారు.
- ఈ నెల 20న బజార్‌హత్నూర్ మండలంలోని అనంత్‌పూర్ గ్రామానికి చెందిన సేవంతకు ఇచ్చోడ మండలంలోని బొజ్జుగూడకు చెందిన నగేష్‌తో వివాహం జరిగింది. గ్రామస్తులంతా కలిసి రూ.22 వేల నగదు అందించి అండగా నిలిచారు.

గర్వంగా ఉంది



మా గూడెంలో తీసుకున్న నిర్ణయం పలు గూడేల్లో అమలు చేయడం గర్వంగా ఉంది. కాలానికి అనుగుణంగా నడుచుకోవాలి. 50 ఏళ్ల క్రితం కట్నకానుకలు లేకుండానే పెళ్లిళ్లు జరిగేవి. వరుడు వధువు ఇంటివద్ద, వధువు వరుడి ఇంటివద్ద నెలరోజులు పనులు చేసేవారు. వారి పని నచ్చితే పెద్దలు వారిద్దరికి వివాహం జరిపించేవారు.– కుంర భీంరావు, భూమవ్వ, మంగళ్‌మోట్, గ్రామపటేల్ దంపతులు

ఏటీఎం కార్డు మార్చి.. రూ.40వేలు నొక్కేసి..!



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు ఆదర్శ్

భైంసాటౌన్(ముధోల్): ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేసేందుకు వచ్చిన ఓ యువకుడిని ఏమార్చి అతని కార్డును తన వద్ద ఉన్న కార్డుతో మార్చి నగదు తస్కరించిన ఘటన భైంసా పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని దేగాంకు చెందిన ఆదర్శ్ బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసేందుకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఏటీఎంకు వచ్చాడు. డబ్బులు విత్‌డ్రా చేస్తున్న క్రమంలో చింతల్‌బోరికి చెందిన జాదవ్ బాలాజీ డబ్బులు డ్రా చేసిస్తానని చెప్పి అతని కార్డు తీసుకున్నాడు. కొద్దిసేపటికి డబ్బులు రావడం లేదని, బ్యాంకులో అడగాలంటూ తన వద్ద కార్డు మార్చి ఇచ్చాడు. గమనించని ఆదర్శ్ పని నిమిత్తం గ్రామానికి వెళ్లగా రూ.పదివేల చొప్పున రూ.40వేలు డ్రా చేసినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వెంటనే భైంసాకు చేరుకుని ఏటీఎం పరిసరాల్లో గాలించగా సదరు వ్యక్తి కనిపించాడు. నిలదీయగా పారిపోయేందుకు యత్నించాడు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి అప్పగించారు. పోలీసులు అతని వద్ద తనిఖీ చేయగా ఆదర్శ్ ఏటీఎం కార్డు, జేబులో నగదు లభించింది.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ఆరుగురికి స్వల్పగాయాలు



108లో క్షతగాత్రులు

సారంగపూర్(నిర్మల్): అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లోని శంకర్‌నాయక్ తండావాసులు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా సారంగాపూర్–అడెల్లి గ్రామాల మధ్య కుక్క అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో అందులో ప్రయాణిస్తున్న రాథోడ్ మారుణిబాయి, నీలాబాయి, సవిత, శశికళ, అన్నపూర్ణ, రతన్‌సింగ్‌కు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందివ్వడంతో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.


గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య



విష్ణువర్ధన్ (ఫైల్)

దండేపల్లి: గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసినొద్దీన్ తెలిపిన వివరాల మేరకు లక్సెట్టిపేట పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి భూమి విష్ణువర్ధన్ (22) రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం సాయంత్రం బైక్ తీసుకుని ఇంటినుండి బయటికి వెళ్లాడు. రాత్రి సమయంలో బైక్ గూడెం గోదావరి వంతెనపై నిలిపి ఉంచినట్లు తెలుసుకున్న కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మంగళవారం ఉదయం గోదావరి వద్దకు వెళ్లి చూడగా మృతదేహం తేలి ఉంది. మృతుడు ఆరు నెలల కిత్రం ప్రేమ వివాహం చేసుకున్నాడు. మృతుని సోదరుడు మణిదీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

గొడిసిర్యాలలో పురుగుల మందు తాగి మరొకరు ...



నేరెళ్ల అశోక్

దస్తురాబాద్: పురుగుల మందు తాగి యువకుడు బలవన్మరణం చెందిన సంఘటన మంగళవారం మండలంలోని గొడిసిర్యాలలో చోటు చేసుకుంది. ఎస్సై సీ.అశోక్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన నేరెళ్ల అశోక్ (23) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం అతని చిన్నాన్న కుమారుడు పానుగంటి పవన్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి డిప్రెషన్‌కు లోనయ్యాడు. గొడిసిర్యాల ఎక్స్‌రోడ్డు సమీపంలోని అటవీ ప్రాంతంలో అతని తమ్ముడు పవన్ ఆత్మహత్య చేసుకున్న స్థలంలోనే అశోక్ పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు జన్నారంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బాసర గోదావరిలో దూకి మహిళ ...

బాసర(నిర్మల్): బాసర గోదావరిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మండలంలోని ఆష్ట గ్రామానికి చెందిన అనురాధ (35)కు అదే గ్రామానికి చెందిన సాయిలుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాయిలు నిత్యం మద్యం సేవించి ఇంటికివచ్చి వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైంది. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లింది. మంగళవారం తల్లి రాజవ్వకు ఫోన్‌చేసి విషయం తెలిపింది. అనంతరం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా మరణాయుధాలతో సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన వ్యక్తిపై సుమోటో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారిగూడకు చెందిన సలీం ఖాన్ సోషల్ మీడియాలో తల్వార్‌తో ఒక పోస్టును పెట్టడం జరిగిందన్నారు. సుమోటో కేసుగా నమోదు చేసి మంగళవారం సలీం ఖాన్‌పై ఆమ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. ఇదివరకే సలీం ఖాన్ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జవహర్ నవోదయకు 63 మంది ఎంపిక

కుంటాల(ముధోల్): జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–2026 విద్యాసంవత్సరానికిగానూ ఆరోతరగతిలో ప్రవేశానికి జనవరి 18న నిర్వహించిన పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి సుమారు 5 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కుంటాలలోని సృజన విద్యాలయంలో 34, విజయశాయి పాఠశాలలో ఇద్దరు, శాంతినికేతన్ పాఠశాలలో 15, కల్లూర్‌లోని శ్రీసాయి మోడల్ స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ప్రవేశానికి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాళ్లు కొత్తకాపు గంగన్న, సంతోష్, శ్రీకాంత్, బోగ ప్రవీణ్, స్వప్న తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి తరలిస్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన భగత్‌కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణంలోని తాటిగూడకు చెందిన కలీమొద్దీన్ అలియాస్ కల్లు ఇంటి వద్ద నుంచి మంగళవారం మధ్యాహ్నం గంజాయి తీసుకొని వెళ్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా కలీమొద్దీన్‌పై ఇదివరకే పలు కేసులతో పాటు సస్పెక్ట్ షీట్ ఉందన్నారు. ఇదివరకే ఆయనను బైండోవర్ సైతం చేయడం జరిగిందన్నారు. భగత్‌కృష్ణను అరెస్టు చేసి బైండోవర్ చేయగా, కలీమొద్దీన్ పరారీలో ఉన్నట్లు వివరించారు.

స్తంభం పైనుంచి పడి లైన్‌మెన్‌కు గాయాలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా కిందపడడంతో లైన్‌మెన్‌కు గాయాలైనట్లు విద్యుత్‌శాఖ ఏడీ ప్రభాకర్ తెలిపారు. లైన్‌మెన్ రాజు మరమ్మతు పనులు చేస్తుండగా పైన ఉన్న 33 కేవీలైన్ వైరు కింద ఉన్న లైన్‌వైరుకు తాకడంతో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఏడీ పేర్కొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు

రామకృష్ణాపూర్: పట్టణంలో నివసించే ఓ బాలిక(10)తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బాలిక నో రుమూసి ఇంట్లోకి రమ్మని అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పులికుంట గ్రామ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై డీ.చంద్రశేఖర్ తెలిపారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, ఒంటిపై నలుపురంగు నైట్‌ప్యాంటు, నల్లని చారల చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చన్నారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అరుదైన పక్షి



దహెగాం మండల కేంద్రంలో మంగళవారం అరుదైన పక్షి కనిపించింది. ఎండవేడికి తట్టుకోలేక దుకాణ సముదాయాల్లోకి వచ్చింది. స్థానికులు పట్టుకుని నీటిని తాగించారు. ఎఫ్‌ఎస్‌వో సద్దాం దృష్టికి తీసుకెళ్లగా దీని పేరు గోల్డెన్ ఓరియల్ అని పేర్కొన్నారు. ఇది అటవీ ప్రాంతాల్లో కనిపిస్తుందన్నారు. – దహెగాం

విద్యార్థుల జంగల్ సఫారీ



హాజీపూర్ మండలం గఢ్‌పూర్ మండల పరిధిలోని ఎంసీసీ క్వారీలో గల జంగల్ సఫారీలో మంగళవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలకు చెందిన బీజెడ్‌సీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ట్రెక్కింగ్ చేశారు. అటవీ ప్రాంతంలో పర్యటిస్తూ వివిధ రకాల చెట్లతో పాటు మెడికేటెడ్ చెట్లు, వివిధ రకాల పక్షులు, జంతువుల గురించి తెలుసుకున్నారు. గడ్డి వనాలు, ఎత్తయిన కొండలు, అటవీ అందాలను తిలకించారు. ఎఫ్‌బీవోలు రాజేందర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)

అమెరికాలో మెరిసిన యశిక



మాధవరపు యశిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రానికి చెందిన మాధవరపు యశిక ప్రతిష్టాత్మకమైన యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామినేషన్(యూఎస్‌ఎంఎల్‌ఈ)లో అరుదైన ఘనత సాధించింది. రెండు విడతలుగా జరిగిన పరీక్షల్లో ఫ్యామిలీ మెడిసిన్‌లో సీటు సంపాదించింది. మూడేళ్ల తర్వాత వచ్చే పీజీ పట్టాతో ప్రపంచంలోని ఏ దేశంలోనైనా వైద్యసేవలు అందించేలా అవకాశాన్ని అందిపుచ్చుకుంది. యశిక 1 నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లో పూర్తి చేసింది. బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలతో అనుసంధానమైన అమెరికా న్యూయార్క్‌లోని జేవియర్ వైద్య కళాశాలలోని ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్) కోర్సును పూర్తి చేసి అమెరికాలోని చికాగోలో 18 నెలల స్టెప్–1, స్టెప్–2 క్లినికల్స్ కూడా పూర్తి చేసింది. తల్లిదండ్రులు శిల్ప, రాజేశ్వర్‌రావు రాజకీయాల్లో రాణిస్తున్నారు. యశికను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు హాజీపూర్ మండల వాసులు ప్రత్యేకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

గంజాయి నియంత్రణపై స్పెషల్ ఫోకస్

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం: గంజాయి నియంత్రణపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, అరెస్టులు, కేసుల దర్యాప్తులు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్‌కు సంబంధించి ప్రస్తుత పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ, మిస్సింగ్, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, గేమింగ్ యాక్ట్, తదితర కేసులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలీస్ అధికారి చట్టపరిధిలో పనిచేయాలన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పారదర్శకంగా, న్యాయపరంగా విచారణ జరపాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లను నియమించి సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో విలేజ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి విక్రయం, సేవించేవారిపై కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. సమావేశంలో డీసీపీలు ఎగ్గడి భాస్కర్, కరుణాకర్, అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు రమేశ్, కృష్ణ, నరసింహులు, మల్లారెడ్డి, ఏఆర్ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై ప్రావీణ్యం పెంచుకోవాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఆంగ్లభాషపై విద్యార్థులు ప్రావీణ్యం పెంచుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం ఉట్నూర్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు బోస్ సంస్థ అందిస్తున్న సేవలతో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. వేసవి సెలవుల్లోను విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఏసీఎం జగన్ మాట్లాడుతూ విద్యార్థి తలరాతను మార్చేది ఉపాధ్యాయులే అన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక, ఆంగ్ల నాటికలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన వారికి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఏసీఎంవోలు ఉదవ్, రాథోడ్ శివాజీ, క్రీడల అధికారి పార్థసారథి, దేవ్‌రావు, బోస్ సంస్థ నిర్వాహకులు రోమిల, నిక్షిత, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలపై త్రిసభ్య కమిటీ విచారణ



సుంకిడిలో విచారణ జరుపుతున్న సభ్యులు

తలమడుగు: మండలంలోని సుంకిడి, ఝరి గ్రామాల్లో ఇటీవల అప్పుల బాధతో ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా రైతు ఆత్మహత్యల నివారణ కోసం ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం గ్రామాల్లో విచారణ చేపట్టారు. కమిటీ సభ్యులైన ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి ఏడీ రాంకిషన్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎస్సై అంజమ్మ, వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి ఝరి గ్రామానికి చెందిన రైతు గడం పోతారెడ్డి కుటుంబ సభ్యులను విచారించారు. రైతుకు ఎన్ని ఎకరాల పొలం ఉంది? కౌలుకు ఎన్ని ఎకరాలు తీసుకున్నాడు? పెట్టుబడి సాయం ఏబ్యాంకులో తీసుకున్నాడు? ప్రైవేట్ అప్పులు ఎంత తీసుకున్నారు? అని వివరాలు సేకరించారు. అనంతరం సుంకిడి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగన్న ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. రైతు వ్యవసాయ వివరాలు, పట్టా పాసు బుక్‌లను, బ్యాంక్ ఖాతాలు, అప్పులు, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుంకిడి మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.